క్లుప్తంగా

కొనసాగుతున్న శిలువ మార్గాలు



గుడివాడరూరల్: క్రైస్తవులు నిర్వహించే ఉపవాస దీక్షల్లో భాగంగా క్రీస్తు శిలువ మార్గ యాత్రలు పట్టణంలోని పెద ఎరుకపాడు(ఆర్సీఎం) చర్చి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఆర్సీఎం విచారణ గురువు ఫాదర్ గుజ్జుల మైఖేల్, సహాయ గురువు ఫాదర్ శ్రీకాంత్ ప్రత్యేక ప్రార్థనలతో యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తపస్సు కాలమైన 40రోజుల పాటు ప్రతి గ్రామంలో శిలువ మార్గాలను గుడ్‌ఫ్రైడే వరకు నిర్వహిస్తారన్నారు.

విద్యార్థులకు కరాటే పోటీలు

పామర్రు: స్థానిక యలమర్రు రోడ్డులోని ఏఎన్ఎం హైస్కూల్లో ఈ సంవత్సరంలో కరాటేలో శిక్షణ తీసుకున్న విద్యార్థులకు నైపుణ్య పోటీలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హైస్కూల్ ప్రిన్సిపాల్ ఏ పూర్ణచంద్రారెడ్డి మాట్లాడుతూ ఈ పరీక్షలో భాగంగా కరాటే బెల్టు టెస్టులను నిర్వహించారన్నారు. ఈ టెస్టులో 38 మంది విద్యార్థులు పాల్గొని నైపుణ్య పోటీల్లో ప్రతిభ కనబరచినట్లు పేర్కొన్నారు. వీరికి ప్రశంసా పత్రాలను 7వ డాన్ బ్లాక్ బెల్టు గ్రహీత ఏకేఎఫ్ జెడ్జి ఏపీటీ డైరెక్టర్, కృష్ణాజిల్లా కరాటే బోర్డు కార్యదర్శి ఎస్ వెంకటేశ్వరరావు ఇచ్చారు. విజేతలను హైస్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

అన్న సమారాధనకు విరాళం అందజేత



పామర్రు: ఉండ్రపూడి–పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న వీరాంజనేయస్వామి దేవస్థానంలో శ్రీ రామ నవమి ఉత్సవాల సందర్భంగా నిర్వహించే మహా అన్న సమారాధనకు నాగపట్నం వద్ద ఉన్న అక్షయ ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్ వారు రూ.25,678 చెక్కును విరాళంగా ఇచ్చారని ఆలయ ఈఓ పీవీవీఎస్ ప్రసాదరావు శుక్రవారం తెలిపారు. ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు కల్యాణ మహోత్సవాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తాడిశెట్టి వెంకటేశ్వరరావు, మట్టా వెంకటేశ్వరరావు, వెన్నా శ్రీనివాసరావు, దాడి పవన్‌కుమార్, కూనపరెడ్డి సుబ్బారావు, ఈడే గంటేశ్వరరావు, అక్షయ కంపెనీ అధికారులు పాల్గొన్నారు.

అధికారుల గైర్హాజరుపై సభ్యుల ఆగ్రహం

మండవల్లి: మండవల్లి మండల సర్వసభ్య సమావేశానికి పలువురు అధికారులు రాకపోవడంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి రానివారిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి, తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశానికి హాజరైన వ్యవసాయశాఖ, ఐసీడీఎస్, ఆరోగ్య, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, గృహ నిర్మాణ శాఖ, ఉపాధి హామీ పథకం అధికారులు తమ శాఖల పనితీరు, ప్రజలకు అందజేసే సేవల గురించి వివరించారు. జెడ్పీటీసీ సభ్యురాలు ముంగర విజయ నిర్మల, వైస్ ఎంపీపీలు ఎ.ఆదివిష్ణు, కె.సుధారాణి, ఎంపీడీఓ కె.రామలింగేశ్వరరావు, ఈఓ పీఆర్డీ సీహెచ్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కల్యాణ మహోత్సవాలు

కైకలూరు: కలిదిండి మండలం తాడినాడ శ్రీ సీతారామ స్వామి కల్యాణ మహోత్సవాలు ఘనంగా జరుగుతోన్నాయి. కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామివారికి సుప్రభాత సేవ, నిత్యార్చన, భేరిపూజ, నిత్యహోమం, బలిహరణ కార్యక్రమాలను శుక్రవారం నిర్వహించారు. తాడినాడ వికాస తరంగిణీ ఆధ్వర్యంలో శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం జరిగింది.

కోరలు చాస్తున్న కలుషిత తాగునీటి సమస్య

- పని చేయని రక్షిత మంచినీటి పథకాలు
- తాగునీటి సరఫరాలో చేతులెత్తేసిన పాలకులు



కలుషితమైన ఒద్దులమెరక గ్రామ తాగునీటి చెరువు

గుడివాడరూరల్: కలుషిత మంచినీటి సమస్య మండలంలోని పలు గ్రామాల్లో కోరలు చాస్తోంది. తాగునీటి చెరువులు కలుషిత కాసారాలుగా మారాయి. తాగునీరు రంగుమారి దుర్వాసన వస్తుండడంతో వానిటి తాగలేక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రతి గ్రామంలో రక్షిత మంచినీటి పథకం ఉన్నా సక్రమంగా పని చేయకపోవడంతో ప్రజలు నీటిని పాలు మాదిరిగా కొనుగోలు చేసి తాగాల్సిన దుస్థితి నెలకొంది.

హామీని గాలికొదిలేసిన కూటమి నేతలు

ఎన్నికల సమయంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని గద్దెనెక్కిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చాక సమస్యను గాలికి వదిలేశారనే విమర్శలున్నాయి. వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి చెరువుల్లో అరకొర నీరు ఉంది. దీంతో ప్రజలు తీవ్ర తాగునీటి ఎద్దడిని ఎదుర్కొనే విపత్కర పరిస్థితులు ఎదురయ్యే అవకాశం పొంచి ఉంది. దీంతో మండల వాసులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో 23 గ్రామ పంచాయతీలు, 20శివారు గ్రామాలున్నాయి. రెండు దశాబ్దాల కాలంలో ఈ ప్రాంతంలో ఆక్వా పరిశ్రమ అభివృద్ధి చెందడంతో 40వేల ఎకరాల పంట పొలాలు చేపల చెరువులుగా మారాయి. చెరువుల్లో చేపలతో పాటు రొయ్యల సాగు చేయడంతో రానురాను పంట కాల్వలు, చానల్స్ కలుషితంగా మారడంతో గ్రామాల్లో కలుషిత తాగునీటి సమస్య తీవ్రమైంది.

రొయ్యల చెరువుల్లో నీటిని వదిలేస్తున్నారు

చేపల, రొయ్యల చెరువుల సాగు వలన పట్టుబడి సమయంలో కలుషితమైన చేపల, రొయ్యల చెరువుల్లో నీటిని తాగునీటి చెరువులకు నీటిని అందించే పంట కాల్వలు, చానల్స్‌లోకి వదిలేయడంతో ఆ నీటినే తాగునీటి చెరువులకు పెడుతున్నారు. ఫలితంగా కలుషిత నీరు చెరువుల్లో చేరి రోజులు గడిచే కొద్ది తాగునీటి చెరువులు ఉప్పునీటి చెరువులుగా మారిపోతున్నాయి. పోలుకొండ, ఎల్ఎన్ పురం, ఇలపర్రు, శంకరపాడు, గండేపూడి, పానుకుమాడు గ్రామాలకు కాల్వల నుంచి తాగునీటిని పెట్టే అవకాశం లేకపోవడంతో విజయవాడ, గుడివాడ ప్రాంతాల నుంచి మురుగును తెచ్చే బుడమేరు, చంద్రయ్య డ్రెయిన్‌లలోని నీటిని పెడుతున్నారు. కలు



జనార్దనపురం ఎస్సీ కాలనీలో పని చేయని ఫిల్టర్‌బెడ్‌లు



ఎల్ఎన్‌పురంలో నిరుపయోగంగా ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్

రక్షణ ఇవ్వని మంచినీటి పథకాలు

నందివాడ మండలంలో 23 గ్రామాలతో పాటు శివారు గ్రామాల్లోనూ రక్షిత మంచినీటిని అందించేందుకు తాగునీటి పథకాలున్నాయి. ముఖ్యంగా 2004లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో మండలానికి చెందిన పిన్నమనేని వెంకటేశ్వరరావు గ్రామీణ మంచినీటి సరఫరా మంత్రిగా పని చేయడంతో ప్రతి గ్రామంలోనూ ఫిల్టర్ బెడ్‌ల నిర్మాణం, మైనర్ గ్రామాల్లో మైక్రో వాటర్ సిస్టం మినీ రక్షిత మంచినీటి పథకాలను ఏర్పాటు చేశారు. దీంతో మంచినీటి చెరువుల నుంచి వచ్చే నీరు క్లోరినేషన్ కావడం వలన తాగేవారు. ప్రస్తుతం పరిస్థితి తారుమారైంది. ఏ గ్రామంలో చూసినా పని చేయని ఫిల్టర్‌బెడ్‌లు, నిరుపయోగంగా ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్‌లు దర్శనమిస్తున్నాయి. రుద్రపాక, పుట్టగుంట, ఒద్దులమెరక, పెదలింగాల, జనార్దనపురం, ఎల్ఎన్‌పురం గ్రామాల్లో తాగునీటి పరిస్థితి జటిలంగా మారింది.

మురుగునీటి డ్రెయిన్ నీరే గతి



దశాబ్దాలకాలంగా దోసపాడు చానల్ నుంచి మా చెరువుకు నీరు రావడం లేదు. తాగునీటి కోసం బుడమేరు ఎగువ నుంచి వచ్చే మురుగునీటిని తాగునీటి చెరువుకు పెడుతున్నారు. మురుగునీరు కావడంతో పూర్తిగా కలుషితమై తాగడానికి వీల్లేని విధంగా మారుతున్నాయి. నీటిని కొనుగోలు చేయలేని పేదలు ఆ నీటిని తాగి రోగాల బారిన పడుతున్నారు.

– చింతాడ నాగూర్, ఎల్ఎన్‌పురం

ఇబ్బందులు పడుతున్నాం



రెక్కాడితే గాని డొక్కాడదు. ఏ రోజు కూలీ ఆ రోజు వస్తే పూట గడుస్తుంది. తినడానికే తంటాలు పడుతున్నాం. చెరువులో నీరు కలుషితమవ్వడం వలన నీరు తాగలేకపోతున్నాం. నీటి కోసం రోజూ మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పుట్టగుంట గ్రామానికి వెళ్లి నీటిని కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నాం. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. సమస్యను పరిష్కరించి అధికారులు, పాలకులు పుణ్యం కట్టుకోవాలి.

– ఫణిబాబు, పోలుకొండ

పాలు మాదిరిగానే నీరు కొనుగోలు

...పడుతున్నారు. కలుషిత మంచినీటి సమస్య పుణ్యమా అని ప్రతి గ్రామంలోనూ ప్రజలు రోజు పాలు కొనుగోలు చేసిన మాదిరిగా నీటిని కొనుగోలు చేస్తున్నారు. 20లీటర్ల ఒక్కో క్యాన్ రూ.25 నుంచి రూ.30కు విక్రయిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, పాలకులు మండలంలో నెలకొన్న కలుషిత తాగునీటి సమస్యపై దృష్టిసారించి పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



గుడివాడరూరల్: గుడివాడ విశ్వభారతి హమ్మింగ్ బర్డ్స్ పాఠశాల్లో గ్రాడ్యుయేషన్ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ, డైరెక్టర్ మంజుల జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత చిన్నారుల తల్లిదండ్రులకు పొట్లూరి అభివాదం చేశారు. అనంతరం చిన్నారులకు గ్రాడ్యుయేషన్ పట్టాలను, బహుమతులను అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాధ మాట్లాడుతూ చిన్నారులకు ఆటపాటల ద్వారా ఒత్తిడిలేని విద్యను అందించడం వలన వారిలో సృజనాత్మక శక్తి పెంపొందుతుందన్నారు.

సాంకేతిక నైపుణ్యంపై అవగాహన పెంచుకోవాలి

గుడివాడరూరల్: నేటి ప్రపంచంలో సాంకేతిక నైపుణ్యాలపై అవగాహన పెంచుకుని యువత ఉపాధి అవకాశాలను దక్కించుకోవాలని ఏకే టెక్నాలజీస్ హైదరాబాద్ కార్పొరేట్ ట్రైనర్ వేదాంతం విరించి పేర్కొన్నారు. ఏఎన్ఆర్ కళాశాల్లో కెరీయర్ గైడెన్స్, ప్లేస్‌మెంట్ సెల్ ఎంసీఏ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కృత్రిమ మేధస్సు సదస్సులో ఆయన శుక్రవారం మాట్లాడారు. ప్రస్తుత ప్రపంచం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మీద నడుస్తోందన్నారు. దానికి అనుగుణంగా విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను నేర్చుకోవాలన్నారు. ముఖ్యంగా క్లౌడ్ కంప్యూటింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, ప్రోగ్రామింగ్ లాంగ్వేజేస్‌లను నేర్చుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పిజేఎస్ కుమార్, కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు ఎల్ఆర్‌కే ప్రసాద్, కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ కెఎస్ అప్పారావు తదితరు పాల్గొన్నారు.

కార్పొరేషన్ రుణాల కోసం ఇంటర్వ్యూలు



పామర్రులో ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న అధికారులు



మొవ్వలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఎంపీడీఓ

పామర్రు: వివిధ కార్పొరేషన్లలో రుణాల కోసం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఇంటర్వ్యూలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కె.జ్యోతి మాట్లాడుతూ మొత్తం 68 కార్పొరేషన్ రుణాలకు రూ.1.92 కోట్లను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఇంటర్వ్యూలలో మండలంలోని 25 గ్రామాల నుంచి సుమారు 700 మందికి పైగా అభ్యర్థులు పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో స్థానిక యూనియన్ బ్యాంక్ మేనేజర్ దుర్గా ప్రసాద్, ఇండియన్ బ్యాంక్ మేనేజర్ శాంతి సుమన, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్, ఎస్‌బీఐ తదితర బ్యాంక్‌ల అధికారులు పాల్గొన్నారు.

మొవ్వలో..

మొవ్వ: బీసీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన రుణాలకు శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆయా గ్రామాలకు అనుసంధానమైన బ్యాంకర్ల సమక్షంలో ఎంపీడీఓ జే విమాదేవి ఇంటర్వ్యూలు నిర్వహించారు. 69 యూనిట్‌లకు 598 మంది దరఖాస్తు చేసుకోగా 541 మంది ఇంటర్వ్యూలకు హాజరైనట్లు ఎంపీడీఓ తెలిపారు.

ఘనంగా ఇంజినీరింగ్ కళాశాల వార్షికోత్సవం



విజేతలకు బహుమతుల ప్రదానం

గుడ్లవల్లేరు: శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం క్రీడా, సాహిత్య, సాంస్కృతిక విభాగాల్లో పోటీలలో విజేతలకు బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు. తొలుత విద్యార్థులకు పాటల పోటీలు, తెలుగు అంత్యాక్షరి, ఫ్లోర్ క్రాసింగ్ తదితర పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా కళాశాల యజమాన్యం సహకారంతో రూ.81వేల నగదు పారితోషికాలను విశ్వవిద్యాలయ స్థాయిలో, అంతర్ కళాశాలల రాష్ట్ర స్థాయి అథెలిటిక్స్, క్రీడా పోటీల్లో విజేతలకు అందజేస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ బి.కరుణకుమార్ తెలిపారు. రూ.42వేల పారితోషికాన్ని యూనివర్సిటీ బ్లూస్‌గా పేరొందిన 21మంది విద్యార్థులకు, అథ్లెటిక్స్, పోటీల్లో పాల్గొన్న 200మంది విద్యార్థులకు రూ.36 వేల పారితోషికాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. తొలుత కళాశాల వ్యవస్థాపక అధినేత స్వర్గీయ వెంకట రామశేషాద్రిరావు విగ్రహానికి నివాళులర్పించారు.

వక్ఫ్ సవరణలకు వ్యతిరేకంగా నిరసనలు తప్పవు



గుడివాడరూరల్: వక్ఫ్ సవరణలకు వ్యతిరేకంగా నిరసన తెలపాలని సీపీఎం నాయకుడు ఆర్సీపీ రెడ్డి అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ హిందూ మతోన్మాద ఎజెండాతో ముస్లిం ప్రజలపై విద్వేషాన్ని చూపుతూ అనేక దాడులు చేస్తోందన్నారు. వక్ఫ్ సవరణ చట్టం ఆస్తులకు కబ్జా చేయడానికి తప్ప ఆస్తులు అభివృద్ధికి కాదన్నారు. భారత రాజ్యాంగంలోని 25,29,30 తదితర నిబంధనలకు వ్యతిరేకంగా ఈ చట్టం చేయడం దారుణమన్నారు. సమావేశంలో రైతు సంఘం నాయకుడు నీలం మురళీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

కైకలూరు: ప్రభుత్వ బడులలో విద్యార్థులకు కావాల్సిన అన్ని మౌలిక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తల్లిదండ్రులు బిడ్డలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మండల విద్యాశాఖాధికారి దొడ్డా రామారావు చెప్పారు. ప్రభుత్వ బడులలో లభించే సౌకర్యాలను తెలియచేస్తూ ఏపీటీఫ్ కైకలూరు మండల శాఖ ముద్రించిన కరపత్రాలను ఎంఈఓ కార్యాలయం వద్ద ఎంఈవో శుక్రవారం అవిష్కరించారు. ఏపీటీఎఫ్ నాయకులు శ్యాం సుందర్, అక్బర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డగోలు ఇసుక రవాణపై చర్యలేవి?

వాడీ వేడిగా తోట్లవల్లూరు మండల సమావేశం



ఇసుక రవాణపై డీటీ సత్యనారాయణను ప్రశ్నిస్తున్న సర్పంచ్ రాధిక

తోట్లవల్లూరు: అడ్డగోలుగా సాగుతున్న ఇసుక రవాణపై ఎందుకు చర్యలు తీసుకోలేకపోతున్నారని తోట్లవల్లూరు సర్పంచ్ పెనుమత్స రాధిక, వైస్ ఎంపీపీ కళ్లం సాంబశివారెడ్డి అధికారులను ప్రశ్నించారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి అధ్యక్షతన శుక్రవారం వాడీ వేడిగా జరిగింది. స్థానిక మండల పరిషత్ సమావేశపు హాల్లో జరిగిన సమావేశంలో వివిధ శాఖల ప్రగతిపై ఎంపీపీ రాజామణి, జెడ్పీటీసీ జొన్నల రామ్మోహన్‌రెడ్డి సమీక్ష జరిపారు. మండలంలోని పలు ఇసుక క్వారీల నుంచి జరుగుతున్న ఇసుక రవాణపై సర్పంచ్ పెనుమత్స రాధిక తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా లారీలు ఓవర్‌లోడ్‌తో ఇసుక రవాణ చేస్తున్నా ఎందుకు చర్యలు తీసుకోవటం లేదని రెవెన్యూ అధికారులను ప్రశ్నించారు. వైస్ ఎంపీపీ కళ్లం సాంబశివారెడ్డి మాట్లాడుతూ ఇసుక తవ్వకాలు, రవాణ గురించి అధికారులకు ఫిర్యాదు చేస్తే, వారు అధికార పార్టీ నాయకులకు సమాచారం ఇస్తున్నారని, ఇది ఎంత వరకు సమంజసమని నిలదీశారు.

బెల్టు షాపులపై చర్యలేవి..

తోట్లవల్లూరులో పాఠశాలలు, సమీప ఆలయాల వద్ద బెల్టు షాపులు నడుపుతుంటే మీరేం చేస్తున్నారని ఎంపీపీ రాజామణి ఎక్సైజ్ కానిస్టేబుల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా మండల సమావేశాలకు మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఏఓ ఉదయభాస్కర్, వైస్ ఎంపీపీలు కళ్లం సాంబశివారెడ్డి, మెల్లంపల్లి వెంకటేశ్వరరావు, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాయిప్రసన్న, ఏఓ నాగేశ్వరరావు, ఎంఈఓ–2 సురేష్, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈలు భవానీ ప్రసాద్, సుబ్బారావు పాల్గొన్నారు.

కోదండరామాలయంలో చోరీ



మంటాడ రామాలయంలోని విగ్రహాలు

పమిడిముక్కల: మంటాడ కోదండరామాలయంలో సీతమ్మవారి మెడలోని 15 గ్రాముల తాళిబొట్టు శుక్రవారం అపహరణకు గురైంది. పోలీసుల కథనం మేరకు ఉదయం ఎనిమిది గంటల సమయంలో పూజారి దీవి అంజనీకుమార్ గుడి వద్ద ఉన్నారు. ఓ వ్యక్తి గుడి వద్దకు వచ్చి లోపలికి వెళ్లి హడావుడిగా బయటకు వెళ్లిపోయాడు. అతడ్ని ఆపి పూజారి ప్రశ్నించగా ఏమీలేదని, పామర్రు నుంచి వచ్చానని చెప్పి వెళ్లిపోయాడు. పూజారి లోపలకు వెళ్లి చూడగా సీతమ్మవారి మెడలోని తాళిబొట్టు మాయమైంది. పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ చిట్టిబాబు సిబ్బందితో వెళ్లి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. పూజారి నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. గ్రామంలోని సీసీ టీవీ ఫుటేజ్‌లను పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సంక్షిప్త వార్తలు

ఉపాధి పనులతో లబ్ధి

మండవల్లి: ఉపాధి హామీ పనుల ద్వారా ఎంతో లబ్ధి చేకూరుతుందని సర్పంచ్ నాగదాసి థామస్ అన్నారు. ఉపాధి హామీ పనులను కానుకొల్లులో ఆమె పర్యవేక్షించారు. ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

హిందూ శ్మశానంలో జంగిల్ క్లియరెన్స్

మండవల్లి: మండవల్లిలో హిందూ శ్మశానంలో శుక్రవారం జంగిల్ క్లియరెన్స్ చేశారు. పనులను సర్పంచ్ మెండా ఝాన్సీ దంపతులు శుక్రవారం పర్యవేక్షించారు. వార్డు సభ్యులు ఆగొల్లు సత్యనారాయణ, అడపా జాన్‌బాబు, పసుపులేటి నాంచారయ్య, పాల్గొన్నారు. ఎస్సీ శ్మశానం, కుమ్మరి శ్మశానంలో కూడా మూడు నాలుగు రోజుల్లో జంగిల్ క్లియరెన్స్ చేయించనున్నట్లు సర్పంచ్ తెలిపారు.

ఉపాధి పనులు ప్రారంభం

గుడ్లవల్లేరు: ఉపాధి హామీ పనులను మండలంలోని కూరాడలో ప్రారంభించారు. శుక్రవారం ఈ పనులను కల్యాణపు నవాబు, బాసా రాంబాబు, శీరం రమేష్ ప్రారంభించారు. వ్యవసాయ పనులు ముగుస్తున్న తరుణంలో ఈ పనులతో కూలీలకు మేలు చేకూరుతుందని గ్రామ కార్యదర్శి జె.ఈశ్వరీకుమారి తెలిపారు.

యలమర్రు అభివృద్ధికి మరిన్ని నిధులు

యలమర్రు(పెదపారుపూడి): యలమర్రు గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు మరిన్ని నిధులు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే వర్ల కుమారరాజా అన్నారు. మండలంలోని యలమర్రులో సీసీ రోడ్లను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో సుమారు ఎన్ఆర్‌జీఎస్, జెడ్పీ, డీఎంఎస్ నిధుల నుంచి రూ.1.22 కోట్లతో సీసీ రోడ్లు పూర్తి చేసి ప్రారంభించటం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వై. రంగారావు, గ్రామ సర్పంచ్ కొల్లూరి అనూష, ఉప సర్పంచ్ సూరపనేని సత్యనారయణ, పంచాయతీ కార్యదర్శి చైతన్య శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జగజ్జీవన్‌రామ్ జయంతి

పామర్రు: బాబూ జగజ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను శనివారం ఉదయం 8 గంటలకు స్థానిక వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు కార్యాలయ సిబ్బంది శుక్రవారం తెలిపారు. వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా కైలే అనిల్‌కుమార్ హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం స్థానిక చాట్లవానిపురంలోని జగజ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారని తెలిపారు.

సమ్మిళిత పచ్చిరొట్ట పైరు మేలు



కైకలూరు: వ్యవసాయ రైతులు సమ్మిళిత విత్తన పచ్చిరొట్ట పైర్ల పెంపకంతో భూమిలో పోషక విలువలు పెరుగుతాయని కైకలూరు వ్యవసాయ సహాయ సంచాలకుడు ఆర్.గంగాధరరావు చెప్పారు. వేమవరప్పాడు రైతు సేవా కేంద్రం వద్ద నవధాన్యాల విత్తనాల సంచుల తయారీని రైతులతో శుక్రవారం చేయించారు. మొదటి విడతగా రైతులకు 300 కిట్స్ సిద్ధంగా ఉంచామన్నారు. కార్యక్రమంలో కైకలూరు, కలిదిండి మండలాల వ్యవసాయాధికారులు ఆర్. దివ్య, విద్యాసాగర్, ఎస్ఎఫ్ఏ మధుబాబు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ

ముదినేపల్లి రూరల్: మండలంలోని బొమ్మినంపాడులో ప్రకృతి వ్యవసాయంపై విద్యార్థులు అవగాహన ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ ఇన్‌చార్జి గౌతమ్‌కుమార్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. స్థానిక పాఠశాల హెచ్ఎం బేతాలరావు, ఉపాధ్యాయుడు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కోదండరాముడి కల్యాణోత్సవాలు ప్రారంభం

ముదినేపల్లి రూరల్: మండలంలోని సింగరాయపాలెం బావాజీ మఠంలోని కోదండ రామాలయంలో తిరు కల్యాణోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఇక్కడ ఏటా బంజారాల సంప్రదాయల ప్రకారం భోగ్ వేడుకలు నిర్వహించి రాములోరి కల్యాణం చేస్తారు. దీనికి రాష్ట్రంతో పాటు తెలంగాణ నుంచి బంజారాలు పెద్ద ఎత్తున తరలివస్తారు. ఈ కల్యాణోత్సవాలు ఆరో తేదీ వరకు కొనసాగుతాయి.

ప్రత్యేకావసరాల విద్యార్థులకు ఫిజియోథెరపీ

పెదపారుపూడి: స్థానిక ప్రాథమిక పాఠశాల్లో శుక్రవారం ప్రత్యేకావసరాల కలిగిన విద్యార్థులకు ఫిజియథెరపీ క్యాంపు నిర్వహించారు. ఫిజియోథెరపిస్టు కె.శ్యామ్ ప్రసాద్ ఆరుగురు చిన్నారులకు థెరపీ చేశారు. ఐఆర్పీలు హరిబాబు, కిషోర్‌బాబు పాల్గొన్నారు.

గుడివాడ మార్కెట్ యార్డ్ చైర్మన్ రవికుమార్

గుడివాడరూరల్: గుడివాడ మార్కెట్ యార్డ్ చైర్మన్ చాత్రగడ్డ రవికుమార్ నియమితులయ్యారు. ఏపీలో నామినేటెడ్ పదవుల ప్రకటనలో భాగంగా నందివాడ మండల టీడీపీ నాయకుడు రవికుమార్‌ను ఏఎంసీ చైర్మన్‌గా నియమించారు. ఈయన గతంలో ఎంపీపీగా పని చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి వచ్చేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు ధన్యవాదాలు తెలిపారు.

రీ సర్వేతో భూ సమస్యల పరిష్కారం

కైకలూరు: భూముల రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కైకలూరు తహసీల్దారు ఎండీ.ఇబ్రహీం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్టులో భాగంగా ఆటపాకలో అవగాహన సదస్సు, ర్యాలీని శుక్రవారం చేపట్టారు. తహసీల్దారు మాట్లాడుతూ రీ సర్వే ఫేజ్–2లో మండలంలో సోమేశ్వరం గ్రామాన్ని పూర్తి చేశామని పేర్కొన్నారు. ఇప్పుడు ఆటపాకలో రీ సర్వే జరుగుతోందన్నారు.

ఫార్మసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడిగా జాన్‌బాబు

ముదినేపల్లి రూరల్ : ఫార్మసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా ముదినేపల్లికి చెందిన పట్టెం జాన్‌బాబు నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం చైర్మన్ మద్దెల సురేష్‌బాబు రాష్ట్ర అధ్యక్షుడు లుక్కా నరేష్, ప్రధాన కార్యదర్శి చరపాక హేమంత్ ఆదేశాలు జారీ చేశారు.

తహసీల్దార్ బదిలీ

ముదినేపల్లి రూరల్: తహసీల్దార్ జేఎస్ సుభానీ రాష్ట్ర సచివాలయానికి బదిలీపై వెళ్లారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం మండవల్లి నుంచి బదిలీపై ముదినేపల్లి వచ్చారు. ప్రస్తుతం డిప్యూటీ తహసీల్దార్ పవన్‌కుమార్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.